క్లుప్తంగా

బహుమతుల పంపిణీ

పామర్రు: నూతన సంవత్సరం–2024ను పురస్కరించుకుని విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించారు విజేతలైన వారికి బహుమతులను అందజేశామని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘంనియోజకవర్గ అధ్యక్షుడు సాల్మన్ కొల్లా బత్తుల తెలిపారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో సోమవారం విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహకాలను అందిస్తోందని అన్నారు. విజేతలైన వారికి బహుమతులను అందజేశామని అన్నారు. విజన్‌లైఫ్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలి

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్న కార్యక్రమాన్ని గుడివాడ మండలంలోని ప్రజలు విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు కొత్త రూపురేఖలు తీసుకువచ్చి గ్రామాల్లోని ప్రజలకు అంబేడ్కర్ జీవిత చరిత్రను వివరించాలన్నారు.

సత్కారం

గుడివాడరూరల్: గత ఏడాది శ్రీకృష్ణయాదవ సేవా సంఘం చేసే సేవా కార్యక్రమాలకు చేయూతనందించి ప్రోత్సహించిన పలువురు మానవతా మూర్తులను ఘనంగా సత్కరించారు. వివరాలను శ్రీకృష్ణయాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక కమ్మవారిసత్రంలో సోమవారం యాదవసేవా సంఘం 11వ వార్షికోత్సవం సభను ఘనంగా నిర్వహించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనందం, బీసీ సంఘ నాయకుడు కఠారి రామ్‌కుమార్, వైశ్య సంఘ ప్రముఖుడు బొగ్గరపు తిరుపతయ్య, తాతా సాయిమురళీకృష్ణ, పల్లపోతు నాగబాబు, యలమర్తి కృష్ణారావు, జోగా బాలకృష్ణ, షేక్ సయ్యద్, గఫార్, పులిపాక రామ్మోహనరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిఆటల పోటీల్లో గెలుపొంది తమ ప్రతిభను చాటివ్యక్తిగత ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు అని సోమవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు.అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ నెల 4, 5, 6వ తేదీల్లో ఆటల పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాలికల గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నారని చెప్పారు. విజేతలను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహ కార్యదర్శి రామకృష్ణ, మెంటార్ రామాంజనేయులు,అధ్యాపకులుఅభినందించారు.

శ్రీరాముని అక్షింతల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాకలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు పైడిపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు. నిర్వాహకులు నగుళ్ళ రవి, శీలం రాంబాబు, దొడ్డాకుల శ్రీను, కరేటి ఆంజనేయులు, దొడ్డాకుల పూర్ణ, నగుళ్ళ వెంకటేశ్వరరావు, బండారు ఆంజనేయులు, వేల్పూరి గోవిందరాజులు, పైడిపాటి బుజ్జి, బోయిన సుబ్బారావు, అడుసుమల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్ నగర్‌కు చెందిన తెలుగు సుధాకర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద చాకుతో దాడికి పాల్పడినగోగులమూడి అనిల్‌కుమార్, గుమ్మడి నాగేశ్వరరావు(చంటి), గుమ్మడి రామయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలియజేశారు.ముగ్గురిపై హత్యాయత్నం కేసునమోదు చేసి ఉయ్యూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. రిటైర్డ్ హెచ్ఎం యర్నేని ప్రసాద్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో మెటీరియల్‌ను అందజేశారు. హెచ్ఎం వై విజయకుమార్, జి.రమేష్, సత్యనారాయణరాజు,ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పమిడిముక్కల: మండలంలోని ఐనపూరు గ్రామంలో సోమవారం రాత్రి పోలీసులు దాడులు జరిపి అక్రమ మద్యం స్వాధీనం చేసుకొన్నారు. ఎస్ఐ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చాట్రగడ్డ రవి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద 8 ఫుల్ బాటిళ్లు, 7 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్
- పందిరిపల్లిగూడెం ప్రజలతో ఆత్మీయ సమావేశం



పందిరిపల్లిగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ, పక్కన ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కొల్లేరు గ్రామ ప్రజలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ప్రేమాభిమానాలు ఉన్నాయని, ప్రజలకు అండగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. పందిరిపల్లిగూడెం గ్రామంలో ప్రజలు, పెద్దలతో ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారన్నారు. టీడీపీలో కొనసాగుతూ అవమానాలు పడుతున్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి ఆదరించారన్నారు. కొల్లేరు ప్రజలు రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే డీఎన్నార్ కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద సమీప జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా దాతల సాయంతో రూ.కోట్లు వెచ్చించి అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నారన్నారు. కొల్లేరు గ్రామాల్లో అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో డీఎన్నార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డీఎన్నార్‌కు పూర్తి మద్దతు అందిస్తామని పలువురు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు ముంగర నరసింహారావు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, పార్టీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనివేటి మండపం పనుల పరిశీలన..

కొల్లేటికోటలో శరవేగంగా జరుగుతున్న అనివేటి మండపాన్ని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలసి ఎమ్మెల్యే డీఎన్నార్ పరిశీలించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ అద్భుత అనివేటి మండప నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. శిల్పులు చక్కటి ప్రతిభను చూపుతున్నారు. త్వరలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఎంపీటీసీ బలే నరేష్, గ్రామ పెద్ద బలే సముద్రుడు, పందిరిపల్లిగూడెం ఉప సర్పంచ్ మేడిశెట్టి మహేష్, కొల్లేటికోట దేవస్థానం మాజీ చైర్మన్ జల్లూరి వెంకన్న పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సందడి



జమీదగ్గుమిల్లిలో హరిదాసుకు బియ్యం పోస్తున్న చిన్నారులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

జమీదగ్గుమిల్లి(పామర్రు): మన భవిష్యత్ తరాల వారికి సంస్కృతి సంప్రదాయాలను అందించేందుకు పండుగులు ఎంతోగానో దోహదపడతాయని జమీదగ్గుమిల్లి జెడ్పీహైస్కూల్ హెచ్ఎం టీఎస్ హను ప్రసాద్, కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో జెడ్పీహైస్కూల్‌లో ఘంటసాల కళాపీఠం, హైస్కూల్ ఉపాధ్యాయుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి వివిధ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, హరిదాసు వేషధారణతో చిన్నారులు రామకీర్తనలను పాడుతూ, గోదాదేవి వేషధారణలో చిన్నారులు, గాలి పటాల పోటీలు, బొంగరాల పోటీలు, కోలాట ప్రదర్శనలు చేసిన విద్యార్థినిలు, భోగిమంట తదితర అంశాలను ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ నందిపాటి హేమంత్‌రెడ్డి, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అడ్డాడ గ్రామంలో అరవింద హైస్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. గాలిపటాల పోటీలో వీ లోకేష్, ఏ ధనుష్, యూ.కళ్యాణ్‌లు విజేతలు కాగా, రంగోలి పోటీలలో రమ్య, పీ దేవి, శివ ప్రమీలలు బహుమతులు సాధించారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపల్ రమణ మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ముదినేపల్లి రూరల్‌లో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొరగుంటపాలెం యూపీ స్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిపారు. విద్యార్థులు సంక్రాంతి ముగ్గులను తీర్చిదిద్దారు. హరిదాసు వేషాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కలిదిండి: మండలంలోని పేటకలిదిండి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో రంగవల్లులు తీర్చిదిద్దారు. హరిదాసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ పి ప్రభాకరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి. రజనీకుమారి, సభ్యులు ప్రధానోపాధ్యాయుడు ఎ.రాజమోహన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నష్టపరిహారం అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలు

గుడివాడరూరల్: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాక్షికంగా రెండు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దే పుష్పరాణి, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ ప్రభుత్వం తరపున నష్టపరిహారాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్‌లు మాట్లాడుతూ తుపాను కారణంగా మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన ఉప్పలపాటి కృష్ణవేణి, వలివర్తిపాడు గ్రామానికి చెందిన బొడ్డు రాజేశ్వరిల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఈక్రమంలో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు చెక్కులను అందజేశామన్నారు. ఎంపీడీవో అనగాని వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, విఆర్వో శ్యాంబాబు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

పమిడిముక్కల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9,10,11వ తేదీల్లో తిరుపతిలో జరగనున్న 14వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు బొల్లా శివసతీష్‌బాబు, తలశిల రాంచరణ్, కాసాని ఆకాష్, గుర్రం వీరబాబు, దేవనబోయిన తరుణ్, పోతుబోయిన జస్వంత్, మల్లెల సాయిమనోహర్‌లు ఎంపికైనట్లు హెచ్ఎం వక్కలగడ్డ కేశవనారాయణ తెలిపారు. హైస్కూల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ నారాయణను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా 'జన్ భగీదరి'



దేవరపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రారంభించనున్న సందర్భంగా జన్‌భగీదరి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద జన్ భగీదరి కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తామంటూ ఏర్పాటు చేసిన బ్యానర్‌పై సంతకం చేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత

కై కలూరు: అనారోగ్యంతో గోపవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఈ నెల నుంచి పెంచిన రూ.3000 పింఛను అందించడానికి సర్పంచ్ ఉలిసి వసంతకుమారి గ్రామ వలంటీరు కురేళ్ళ భరత్‌తో కలసి సోమవారం గుంటూరు వెళ్లారు. పింఛన్ సొమ్ము అందించి త్వరగా కోలుకోవాలని కోరారు. ఆస్పత్రికి వచ్చి పింఛను పంపిణీ చేసిన సర్పంచ్‌కు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో డిజిటల్ అసిస్టెంట్ మృతి

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ టీవీ సుబ్రహ్మణ్యం (38) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యం భౌతికకాయన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సందర్శించి సంతాపం తెలిపారు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, సొసైటీ అధ్యక్షుడు బి.గోకర్ణయాదవ్, సర్పంచ్ ఎస్ థామస్, ఎంపీటీసీ కె.నాయనబాబు, సొసైటీ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

రూ.3 కోట్లతో ఆర్‌అండ్ బీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న ఎంపీపీ సురేష్, జెడ్పీటీసీ దుర్గభవాని, ఆదాం

తమ్మలంపాడు(పెదపారుపూడి): మండలంలోని తమ్మలంపాడు నుంచి నందివాడ మండలంలోని కుదరవల్లి వరకు రూ.3 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ గోగం సురేష్, నందివాడ మండల జెడ్పీటీసీ, ఎంపీపీ పెయ్యాల ఆదాంతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ పెదపారుపూడి మండలంలోని తమ్మలంపాడు నుంచి పెట్రోల్ బంక్ వరకు పూర్తి స్థాయి రోడ్డు నిర్మాణ పనులు, నందివాడ మండలంలో అవసరమైన చోట్ల సుమారు 6 కి.మీ పనులు చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో నందివాడ జెడ్పీటీసీ కందుల దుర్గకుమారి, ఎంపీపీ పెయ్యాల ఆదాం, ఆర్‌అండ్‌బీ డీఈ కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లవరపు దాసు, గోళ్ళ సోమేశ్వరరావు, చీకుర్తివరప్రసాద్, మూల్పూరి చంద్రశేఖర్, జూపల్లి శేఖర్, కుమ్మరి రాజేష్, చిగురుపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఆదాయం

కోసూరు(మొవ్వ): పామాయిల్ పంట సాగుతో అధిక లాభాలు పొంద వచ్చునని కృష్ణా జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి జ్యోతి పేర్కొన్నారు. కోసూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ నూనె గింజలు..ఆయిల్ ఫామ్ మిషన్ పథకం ద్వారా ఆయిల్ ఫామ్ సాగును మేకా బాలకృష్ణకు చెందిన ఐయిదున్నర ఎకరాల పొలంలో సోమవారం శ్రీకారం చుట్టారు. భూమి పూజ చేసి 57 మొక్కలను నాటారు. మేనేజర్ చంద్రబాబు, వంకాయలపాటి శ్రీనివాసరావు, గోగినేని పెరుమాళ్లు, రైతులు మేకా బాల కృష్ణతిలక్, హార్టికల్చర్ పామర్రు ఏరియా అధికారిణి నాగదేవకీర్తి, కోసూరు వీఏఏ దగాని సృజన పలువురు రైతులు పాల్గొన్నారు.

యాదవ సంఘ కార్యాలయానికి రూ.లక్ష సాయం

కైకలూరు: జిల్లా ప్రధాన కేంద్రం ఏలూరులో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా యాదవ సంఘ కార్యాలయానికి కై కలూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, తామరకొల్లు సర్పంచ్ భద్రాజు శివాజీ రూ.లక్ష సాయాన్ని సోమవారం అందించారు. కైకలూరు నియోజకవర్గ శ్రీ కృష్ణా యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, కైకలూరు ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు సమక్షంలో చెక్కును అందించారు. ఏలూరు గౌరవ అధ్యక్షుడు కిలారి బుజ్జి, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్ కుమార్, నగర ఉపాధ్యక్షుడు చిట్టిబోయిన సాయి బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గొరైల, మేకల సంఘం అధ్యక్షుడు ఆగొల్ల కృష్ణారావు, జిల్లా యూత్ అధ్యక్షులు బోయిన చంద్రశేఖర్, గడిదేసి సింహాచలం బీసీ నాయకులు ఆలమంద రామారావు యాదవ సంఘం నాయకులు పొట్లేలు పెంటయ్య, వేమవరప్పాడు గ్రామ సర్పంచ్ నున్న రాంబాబు, గురజాల రవి పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో విద్యార్థిని ప్రతిభ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో విద్యార్థిని రైజా మెహజబీన్ ప్రతిభ సాధించారు. ఈ విషయాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో అఖిల భారత అధ్యాపకుల సంఘం అనుసంధానంతో రాజమండ్రిలో వీజేస్ ఫార్మసీ కళాశాల నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని విజయం సాధించినట్లు చెప్పారు. అధిక రక్త పీడనానికి వినియోగించే ఎఫోనిడిపిన్, మెటో ప్రొలాల్ ఔషధాల మోతాదులను నిర్ణయించే పద్ధతిపై పోస్టర్‌ను ప్రదర్శించి ప్రథమ స్థానాన్ని సాధించింది. విజేతను పలువురు అభినందించారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం



వడాలిలో గ్రామసచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ముదినేపల్లి రూరల్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో నెరవేరిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని వడాలిలో రూ.43.6 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ నూతన భవనం, రూ.23.94 లక్షల నిధులతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.15 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను సోమవారం ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన చేరువైందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ పాలన లోపాలు, వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ ఇన్‌చార్జిగా నియోజకవర్గంలో కొనసాగినప్పటికీ తీవ్ర అవమానాలకు గురైనట్లు చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో ముఖ్యమంత్రి జగనన్న తనకు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

ఎంపీపీ గద్దే పుష్పరాణి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్‌లు

గుడివాడరూరల్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సహకారంతో మండలాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ, ఏఎంసీ చైర్‌పర్సన్లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తొలుత మండలంలోని వివిధశాఖల అధికారులు వారివారి శాఖలకు సంబంధించి పురోగతి, ప్రగతిని సమావేశంలోని సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే కొడాలి నానితో చర్చిస్తానని, మండలానికి కావాల్సిన నిధులు మంజూరు చేయించే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పర్చాలని ఆయా శాఖల అధికారులను ఎంపీపీ సూచించారు. పంచాయతీ అధికారులు శానిటేషన్ సిబ్బందితో బ్లీచింగ్, ఫాగింగ్, దోమల మందు పిచికారి పనులు చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తాను కూడా జెడ్పీ నిధులు తీసుకువచ్చి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏఎంసీ చైర్మన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీడీవో వెంకటరమణ, వైస్ ఎంపీపీలు గుంజా వంశీధర్, భట్టు నాగమల్లేశ్వరి, ఆర్ఐ నాగబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



నిమ్మకూరులో దివ్యాంగులకు పెన్షన్లు అందజేస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

నిమ్మకూరు(పామర్రు): అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలో దివ్యాంగులైన వారికి పెన్షన్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కుల, మత, ప్రాంతం, పార్టీ అని బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామనినారు. రూ.3 వేలకు పెంపుదల చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. గ్రామంలోని దివ్యాంగులైన వారికి నూతన పెన్షన్‌లను మంజూరు చేసి అందజేయటం జరిగిందన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి వలంటీర్లు ఠంచన్‌గా పెన్షన్‌లను అందిస్తుఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని అన్నారు. మండల పరిదిలో కొత్తగా 194 పెన్షన్‌లు మంజూయని అన్నారు. కొత్తగా మంజూరైన వీటితో కలిపి మండలంలో మొత్తం 8,109 పెన్షన్‌లు ఇవ్వడం జరుగుతోందని అన్నారు. ఈకార్యక్రమంలో ఏసు, గణపతి,తారక్,నీలాంబ్రం, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవారికి ముత్యాల హారతులు



శ్రీవారికి ముత్యాల హారతులు ఇస్తున్న భక్తులు

పమిడిముక్కల: మంటాడలోని శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామి స్వామి వార్ల దేవస్థానంలో సోమవారం ధనుర్మాసం వేడుకల్లో భాగంగా ముత్యాల హారతుల ఉత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ముత్యాల హారతిని సమర్పించి పూజలు జరిపారు. మహిళా భక్తులకు ప్రకాష్ ఈవెంట్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో భక్తిజ్యోతి పేరిట లక్కీడ్రా నిర్వహించారు. 90 మంది మహిళా భక్తుల నుంచి అందరి సమక్షంలో డ్రా ద్వారా ఎంపిక చేసిన ముగ్గురికి మూడు చీరలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తేజా డిజిటల్స్ అధినేత నేరెళ్ల వేణు చేతుల మీదగా విజేతలైన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత భక్తి ప్రపత్తులతో పాల్గొనాలని వేణు తెలిపారు. ప్రకాష్ ఈవెంట్‌ను అభినందించారు. సీనియర్ పాత్రికేయుడు ప్రకాష్ దంపతులు, దేవస్థాన వ్యవస్థాపక సభ్యుడు రామ్మోహనరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ధూళిపూడి కోటేశ్వరరావు, ఆలయ ప్రతినిధి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

మండవల్లి: కొవ్వాడలంకలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసినట్లు ఎస్ఐ సీహెచ్ఎస్ రామచంద్రరావు సోమవారం పేర్కొన్నారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకునివారినుంచిరూ.2200 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై 9(1) ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి సొంత పూచికత్తుపై విడుదల చేశామన్నారు. మండలంలోని చావలిపాడులో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ జూదాలు ఆడటం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ వీర్రాజుకు ఘన సన్మానం

మండవల్లి: ఏఎంసీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన చేబోయిన వీర్రాజును సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండా సురేష్ సోమవారం ఆయన నివాసం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పలు పదవులు నిర్వహించిన వీర్రాజుకు ఏఎంసీ చైర్మన్ పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.